



ఆ తర్వాత జయ ఎంత ప్రయత్నించినా వినోద్‌తో అంత క్రితంలా ఫ్రీగా మూవ్ కాలేకపోవడం గమనించి: “ ఛ! అలాంటి మాటలు చెప్పి దాని ప్రశాంత హృదయాన్ని కల్లోలపరిచినట్టున్నాను! తనని కదిలించక పోవలసింది! ఇది తెలిస్తే

అన్నయ్య ఇంకెంత డెలికేట్‌గా ఫీలవుతాడో' పశ్చాత్తాపపడింది రజిత.

చివరకు హాస్టల్ కి వెళ్ళిపోయే రోజు రానే వచ్చింది ! ఆరోజు రజితని చాటుగా పిలిచి అడిగాడు వినోద్: "నా గురించి తన అభిప్రాయం ఏమైనా చెప్పిందా ?"

అన్నయ్య కళ్ళలో తొంగి చూస్తోన్న ఆశాకిరణం చూసి అదోలా అయిపోయింది రజిత.

వినోద్ ఏ ఉద్దేశ్యంతో ఆ ప్రశ్న అడిగాడో అతడు అడిగిన తీరే చెప్తోంది! కాని - ఆ ప్రశ్నకు సమాధానం తనకి తెలిస్తే కదా అతడికి చెప్పడానికి. అందుకే:

"లేదు ! నువ్వు అసలు మా సంభాషణలోకి ఎప్పుడూ రాలేదు!" అంది రజిత.

వినోద్ ముఖం వెలవెలబోయింది.

బస్‌లో కూర్చున్నాక "ఇక వెళ్ళొస్తామండీ" అంటూ చేతులు జోడిస్తూ వినోద్ కేసి చూసిన జయకి - అతడి కళ్ళల్లో నీటి తడి స్పష్టంగా కన్పించి - విచలితురాలైంది!

బస్ కనుమరుగయేంత వరకూ వుండి భారంగా వెనుదిరిగాడు వినోద్.

'అసలు తను బయటపడకుండా వుండాల్సింది! కాని ఎంత ప్రయత్నించినా అదేమిటో ఆ కన్నీళ్ళు ఆగలేదు. బొత్తిగా మరీ ఇంత బలహీనుడైపోయాడేమిటి తను?' అనుకున్నాడు వినోద్.

❋❋❋❋❋❋

"అరుణా, అయ్ విల్బి ఎవే ఫర్ టూ డేస్" ఏదో ఉత్తరం పట్టుకొస్తూ అంది నిర్మల.

"ఎందుకూ?" అడిగింది అరుణ.

"ఏమో - నాన్న వెంటనే ఇంటికి రమ్మని ఉత్తరం రాశారు!"

"బహుశః పెళ్ళి చూపులకి ఎవరైనా వస్తున్నారేమో" అనుమానంగా అంది జయ.

"ఎంతో అత్యవసరమైతే తప్ప, నాన్న అలా రమ్మని రాయరు! అసలే ఇక ఈ హాస్టల్లో వుండేది ఒక నెలరోజులే అని ఏడుస్తూంటే మధ్యలో ఈ ప్రయాణాలు ఒకటీ" విసుక్కుంటూ సణుక్కుంటూ బట్టలన్నీ సర్దుకోవడం మొదలెట్టింది నిర్మల.

"తొందరగా వచ్చెయ్యవే?" గేట్ దాకా వచ్చి నిర్మలను సాగనంపుతూ చెప్పింది జయ.

" నన్ను గుర్తురానీకుండా నిన్ను అలరించే ఫ్రెండ్స్ అంతమంది వున్నప్పుడు నా లోటు లెక్కించదగిందేనంటావా జయా!" అంది నిర్మల నవ్వుతూ.

జయ ఏమీ మాట్లాడకుండా చివ్వున తలెత్తి ఓసారి నిర్మల కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లో 'నువ్వేదో నన్నర్థం చేసుకున్నావనుకున్నాను! నువ్వూ అందరి లాంటి దానివేనా ?' అన్న భావాలు కన్పించి చప్పున తల దించుకుంది నిర్మల.

రిక్షా కదిలిపోయింది.

❋❋❋❋❋❋

" నీ అనుమానం అక్షరాలా నిజం జయా ! అనుకోకుండా ఈ నెలాఖరే నా పెళ్ళి నిశ్చయంచేశారు! పెళ్ళికి మన వాళ్ళందర్నీ తీసుకుని వచ్చే బాధ్యత నీదే" అంటూ ఉత్తరం రాసింది నిర్మల.

ఆ శుభవార్త కాస్తా అందరి చెవుల్లోనూ వూదేసింది జయ. పెళ్ళి ఆదివారం కావడంతో పర్మిషన్ ఇవ్వడానికి వార్డెన్ నిరాకరించలేకపోయారు. నిర్మలక్కా వలసిన వాళ్ళందరూ - రెండు టాక్సీలు తీసుకుని బయల్దేరారు.

ఇక పెళ్ళిలో వీళ్ళదే హడావిడి!

ఎటు చూసినా కాలేజీ పిల్లలే ప్రత్యక్షమవడంతో పెళ్ళికి వచ్చిన గొట్టం పాంట్స్, బెల్‌బాటమ్స్‌కి కన్నుల పండువే అయింది. పెళ్ళి చూడటం మాని అమ్మాయిలకేసి పోజులు కొట్టడం ప్రారంభించారు. .

జయ అయితే సరేసరి ! పెళ్ళికొడుకుని ఒకటే ఆటలు పట్టించడం మొదలు పెట్టింది.

" ఆ పెళ్ళి కొడుకుని చూడవే ! ఎలా చూస్తున్నాడో నిమ్మి వంక ! చూడపోతే చీకటి పడేదాకా కూడా ఆగేట్టు లేడు."

'ఎవరా ఈ కొంటెకోణంగి' అనుకుని పెళ్ళికొడుకు ఆడవాళ్ళ వైపు తిరిగాడో లేదో:

"పక్కన బంగారంలాంటి భార్యను పెట్టుకుని చూపులవలలు ఇటు వేపు విసుర్తున్నావేమయ్యా ! జాగర్త - మా నిర్మల అసలే మంచిది కాదు!" అంది జయ ముఖాన్ని అరుణ చాటు చేసుకుని.

జయ మాటలకి గొల్లుమని నవ్వారు పందిట్లో కూర్చున్న వాళ్ళు!

పెళ్ళి కొడుకు ముసిముసి నవ్వులతో నిర్మలవంక చూశాడు - "అవునా!?" అన్నట్లు.

నిర్మల సిగ్గుపడి తల దించుకుంది.

ఇక పెళ్ళికొడుకు తరపు బెల్‌బాటమ్స్, నేరోపాంట్స్ చేరి వీలైనన్ని ప్రణయ గీతాల రికార్డ్స్ చెవులు హోరెత్తిపోయే సౌండ్‌తో పెడ్తూ నానా గొడవ చేయడం మొదలెట్టారు.

అన్నింట్లోకి 'ఎట్లా పుడ్తారే పిల్లలు - ఎట్లా పుడ్తారే అమ్మ్యామ్యాం' అన్న పాట పదే పదే విన్పించడం మొదలెట్టారు.

వాళ్ళ ముందు నుంచి పనిమీద వెళ్తోన్న అరుణని వుద్దేశించి: "ఒరేయ్ ఈవిడని అడగరా పిల్లలు ఎట్లాపుట్తారో" అని పళ్ళికిలించాడో గళ్ళచొక్కా.

" నీముఖం, పాపం పెళ్ళన్నా కాలేదు ! దీనికేం తెలుసురా ?" అన్నాడు మరో గురూ షర్ట్.

"పెళ్ళికాని అమ్మాయిలు ఎంతమంది రహస్యంగా కనడంలేదేమిటీ? ఇది ఆ బాపతే కావొచ్చు! అడగండిరా" అన్నాడో హిప్పీ.

అరుణకు అరికాలు మంట నెత్తి కెక్కింది!

ఓ మేకు సంపాదించి రికార్డ్సు పెడ్తోన్న రూంకి చరచరా వెళ్ళి ఆ రికార్డ్ మీద ఓ గంటు పెట్టి, అబ్బాయిలందరూ తెల్ల ముఖాలేసుకుని చూస్తూంటే - చక చకా బయటికి వచ్చేసింది !

మళ్ళీ రికార్డ్ పెట్టి చూస్తే 'ఎట్టా..... ఎట్టా..... ఎట్టా... గుర్.... గుర్.... ఎట్టా..... గుర్.......' అంటూ 'ఎట్టా'ని దాటి ముందుకు సాగలేదు పాట.

"రికార్డ్ పాడయినట్టుంది ! బాగైంది!" అంది రజిత.

" పాడయిపోలేదు ! మేం పాడుచేసి వచ్చాం!" అంది అరుణ కనుబొమలు మెలి తిప్పుతూ.

"కొయ్యకు! నువ్వా ఘన కార్యం చేస్తూంటే హైర్‌కి వచ్చిన సౌండ్‌సిస్టం వాళ్ళు-గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నారా?"

"ఏమో ! అక్కడెవరుందీ నేను చూస్తేగా ! అంతగా ఏమన్నా అంటే - నష్ట పరిహారం ఇచ్చుకోవచ్చని ధైర్యం చేశాను. ఛీఛీ! ఏం పాట అది ! అలా ద్వంద్వార్థాలు వచ్చేలా అలాంటి పాటలు రాసేవాళ్ళకీ, వాటిని పాడే వాళ్ళకి బుద్ధిలేకపోతే, కనీసం వినే వాళ్ళకైనా వుండాలి వివేకం! ఆ రికార్డ్ పెడ్తూ ఆ వెధవలు ఎలాంటి కూతలు కూశారనీ!" పళ్ళు పట పటా కొరికింది అరుణ.

తనను అన్ని మాటలన్న ఆ త్రిమూర్తులను ఆ రోజు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించిగానీ వదల్లేదు అరుణ.

❋ ❋ ❋ ❋ ❋

పెళ్లయ్యాక ఓసారి అత్తారింటికి వెళ్ళి వచ్చి, ఇక పరీక్షలు దగ్గర పడ్తున్నాయని హాస్టల్‌కి వచ్చేసింది నిర్మల.

వచ్చీరాగానే "హాయ్!" అంటూ చుట్టుముట్టారు మిత్రబృందం.

"నిర్మల ముఖంలో, కొత్త కళ ఏదో కన్పిస్తోందేవ్ !" అంది రజిత.

"ఇంతకీ అది అయిపోయిందా లేదా?" నిర్మలని చూసి కన్ను గీటుతూ అడిగింది అరుణ - 'అది' అనే పదాన్ని నొక్కి పలుకుతూ..

"టెలజ్ అరుణా - వాడ్డూయు మీన్ బై అది ?..." గోల పెట్టారు పిల్లలు.

"అదిగో - వీళ్ళంతా అది అంటే ఏమిటో చెప్పమంటున్నారు నన్ను. మధ్య నాకేం తెలుసు? - ఏదో నీలాంటి తెలిసినవాళ్ళు చెప్తే ఇంట్రెస్టింగా ఉంటుంది గానీ ! చెప్పు నిమ్మీ" అంది అరుణ కొంటెగా.

"అబ్బ! ఏమ్మనిషివే నువ్వు! సిగ్గనేదే పెట్టలేదు దేవుడు నీకు!" అని నిర్మల సిగ్గు పడిపోయినప్పుడుగానీ - పిల్లలకి అది అంటే ఏమిటో అర్థం కాలేదు!

"ఇదేమి చోద్యమే తల్లీ! చేసింది నువ్వయితే సిగ్గుపడాల్సింది నేనా?" అంటూ మూతీ, ముక్కూ తిప్పింది అరుణ బామ్మ పోజుపెడ్తూ.

గొల్లుమన్నారు పిల్లలు.

“అద్సరేగాని, నిమ్మీ ! ఆ అనుభవం ఎలావుందో కాస్త చెప్పు” అడిగింది అరుణ.

“చూడు రాజీ! ‘అది’ అంటే మన అరుణకి ఇప్పటి నుంచే ఎంత ఇదో!?” అంది జయ.

“నీకిప్పుడు తెలిసిందేమోగానీ నా కెప్పుడో తెలుసు!” అంది రజిత.

“ఎలా ?”

“ఆ మధ్య మనిద్దరం పెళ్ళి చేసుకుందామంటూ గోలపెట్టింది మరి ఎందుకనుకున్నావ్?” అంది రజిత కన్ను కొడ్తూ.

“ఏమన్నావ్?” అంటూ పోట్లాటకు సిద్ధపడింది అరుణ.

ఆ గొడవలో ఎప్పుడో చల్లగా జారుకుని - ఎంచక్కా తన రూంలో దూరి - వీక్లీ తిరగేస్తోన్న నిర్మలని ఎవరూ గమనించనేలేదు!

❋❋❋❋❋❋

కాలేజీ వార్షికోత్సవం కూడా జరిగిపోయింది! పరీక్షలు దగ్గర పడటంతో పిల్లలంతా ఇక ఎంజాయ్‌మెంట్‌కి స్వస్తి చెప్పి పుస్తకాల దుమ్ము దులిపి చదువులో నిమగ్నమయ్యారు.

ఓ రెండు నెలలు బాగా చదివి పరీక్షలు రాశామనిపించుకున్నారు.

ఆ పరీక్షలు రాయడంతో చంద్రా, జయల గ్రాడ్యుయేషన్ పూర్తి అయిపోతుంది. రజిత, అరుణా వాళ్ళకింకా మరో సంవత్సరముంది. నిర్మల రాసింది పీయూసీయే అయినా, ఆ తర్వాత సంవత్సరం చదువుతుందన్న నమ్మకంలేదు. ఆ సెలవుల్లో తన పెళ్ళి ఖాయమని చెప్పింది చంద్ర. క్లాసొస్తే తనుమాత్రం ఎమ్మే చదువుతానంది జయ. చదివినా ఆ హాస్టల్లోనే వుండడానికి నిశ్చయించుకుంది. మళ్ళీ యూనివర్సిటీ హాస్టల్లో చేరాలంటే మళ్ళీ కొత్త వాతావరణం, కొత్త కంపెనీ కాబట్టి - దానికన్నా ఈ హాస్టల్లోనే వుండి రోజూ సిటీ బస్‌లో వెళ్ళి రావడం మంచిదనుకుంది జయ.

ఆ విషయమే రజితావాళ్ళతో చెప్తే, “అమ్మయ్య! నువ్వులేని ఈ హాస్టల్లో ఇక ఎలా వుండాలా అని ఒకటే ఇదైపోతున్నాను ! శుభవార్త చెప్పి - నా ప్రాణాలు రక్షించావు. థాంక్స్!” అంది రజిత.

మరో మూడు నెలల్లో రిజల్ట్స్ తెలిశాయి! చంద్రకీ, జయకీ సెకండ్‌క్లాస్ వచ్చింది. నిర్మల, రజిత థర్డ్‌క్లాస్‌లో పాసయ్యారు! క్లాసేదైతేనేం అందరూ పాస్ కావడం వాళ్లకి సంతోషాన్ని కల్గించింది.

ఆ సెలవుల్లో అనుకున్నట్లే చంద్రకి పెళ్లయిపోయింది. వాళ్ళాయన హైదరాబాద్ లోనే వుద్యోగం చేస్తున్నాడు కాబట్టి, అడపాదడపా వారానికొక్కసారైనా హాస్టల్‌కి రావొచ్చని సంబరపడింది.

నిర్మల వాళ్ళాయనకి ఆదిలాబాద్‌కు ట్రాన్స్‌ఫరయి వెళ్లిపోయారు.

‘ఈ అండమాన్ లాంటి ఆదిలాబాద్‌లో ఏమి తోచట్లేదే - ఇలాగే ఇంకో రెండు నెలలున్నానంటే పిచ్చెక్కేట్టే వుంది!’ అంటూ నిర్మల రాస్తే-

'ఎంచక్కా మొగుడుతో షికార్లు కొడ్తూ ఎంజాయ్ చేయక తోచకపోవడమేమిటీ నీ ముఖం!' అని రిప్లై యిచ్చేది జయ.

అప్పుడప్పుడూ ఏవేనా రెండు మూడు రోజుల సెలవులు వస్తే, చంద్ర వచ్చి జయని వాళ్ళింటికి తీసికెళ్ళి సినిమాలూ, షికార్లకీ తిప్పేది !

ఎప్పటిలా ఓసారి దసరా సెలవుల్లో చంద్ర వచ్చి జయని తీసికెళ్ళింది తన ఇంటికి.

ఆ రోజు చంద్ర వంటింట్లో వంట ప్రయత్నంలో మునిగిపోతే - ఏమీ తోచక వరండాలో కూర్చుని ఆ రోజు న్యూస్ పేపర్ చదువుతోంది జయ.



ఏదో చెప్పుల శబ్దం విన్పించి తల తిప్పి చూసేంతలోనే, చంద్ర భర్త ప్రకాశం తన మీద ఏదో కాగితం విసిరేసి వెనక్కి తిరక్కుండా వెళ్ళిపోవడం చూసి ఆశ్చర్యపోయింది జయ.

ఆ కాగితాన్ని విప్పిన జయకి "డాళింగ్ జయా!" అన్న సంబోధన విన్పించి గుండె ఆగిపోయినంత పనైంది.

కింద సంతకం చూస్తే, "నీ ప్రకాశం" కన్పించి ఆగిపోయిన ఆమె గుండె-వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. వణుకుతూన్న చేతులతో ఆసాంతం చదివేసింది జయ.

జయ అందచందాలు సెక్సీగా కన్పిస్తూ తనను పిచ్చెక్కిస్తున్నాయట! చంద్ర వల్ల తనకి శారీరకంగా ఎలాంటి సంతృప్తీ, సంతోషాలు కలగటంలేదట ! అందుకని చంద్ర స్నేహితురాలిగా ఆ ఒక్క రాత్రి అతడి కోరికని తీర్చడానికి ఏదో లాడ్జికి వస్తే కృతజ్ఞుడై వుంటాడట - ఇదీ ఆ లెటర్లోని సారాంశం.

"బ్రూట్ ! ఎంత నీచంగా రాశాడు. ఇలాంటి లెటర్ రాయడానికి వాడికి చేతులెలా వచ్చాయి?" ఆలోచిస్తూ ఎంతసేపలా కూర్చుందోగానీ - చంద్ర వచ్చి భోజనానికి రమ్మనడంతో ఉలిక్కిపడి, లేచి డైనింగ్ హాల్లోకి నిశ్శబ్దంగా నడిచింది జయ.

ఆ సాయంత్రం వరకూ హుషారుగా ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పి నవ్వించిన జయ ఒక్కసారిగా మూగనోము పట్టి సీరియస్ అయిపోవడంతో చంద్రకేమీ అర్థం కాలేదు.

జరిగిన సంగతి చంద్రకి చెప్పేద్దామా అనుకుంది,

కానీ చెప్పడంవల్ల ఆ దంపతులిద్దరిమధ్య మనస్పర్థలు కల్గించడం తప్ప

ప్రయోజనమేమీ లేదని ఆ వుద్దేశ్యం మానుకుంది.

ఆ మర్నాడు ఉదయమేలేచి స్నానమదీ గావించి హాస్టల్‌కి వెళ్ళిపోవాలని బట్టలు సర్దుకోవడం మొదలెట్టింది జయ.

" నేను వెళ్తున్నాను చంద్రా!" ఎడం చేతిలో బ్రీఫ్‌కేస్ పట్టుకుని, చంద్ర రూంలో అడుగెట్టిన జయ ఎదుటి దృశ్యాన్ని చూసి అక్కడే ఆగిపోయింది.

చంద్ర కళ్ళు, ఎర్రగా జ్యోతుల్లా మండుతున్నాయి! ముఖమంతా పీక్కుపోయింది! ముక్కు ఎర్రబడింది! ఏవో లెటర్స్ తనముందు పెట్టుకుని పిచ్చి పట్టినదాన్లా చింపేస్తోంది! పరీక్షగా వాటికేసి చూసింది జయ. చిరిగి పోయిన ఆ కాగితాల్లోంచి తన అక్షరాలు - దీనంగా తొంగి చూస్తున్నాయి!

జయకి జరిగిందేమిటో అర్థంకాక చంద్ర దగ్గరికి వెళ్లి: "ఏమిటిది చంద్రా? ఎందుకిలా వున్నావ్? ఏమైందసలు?" అడిగింది.

మరుక్షణం... చంద్రా వాళ్ళ అత్త విసురుగా పక్కగదిలో నుంచి వస్తూ: "చేసింది చాలక ఇంకా ఏమైందని ఏ ముఖం పెట్టుకుని అడుగుతున్నావమ్మా! ఈ రోజు ప్రకాశంతో ప్రేమ లేఖలు రాయించుకున్నావ్! రేపు అవకాశం దొరికితే వాడితో ఆ పుస్తె కూడా కట్టించుకుంటావ్! అయినా నిన్నని ఏం లాభం? నీలాంటి అడ్డమైన వాళ్ళందర్నీ నమ్మి ఇంటికి తీసుకొచ్చే నా కోడల్ని అనాలి!" అంది రుస రుసలాడ్తూ.

"ఏమిటండీ ! మీరేమంటున్నారో నాకర్థం కావట్లేదు" బిత్తరపోతూ అడిగింది జయ.

"ఎంత నంగనాచివే తల్లీ! ఎంత సమర్ధురాలివి కాకపోతే ఇంత అమాయకత్వం నటిస్తావ్? - ఇదేమిటీ? - ఏమిటీ నీ సంజాయిషీ?" అంటూ తనకి ప్రకాశం రాసిన వుత్తరం విసిరేసినప్పుడుగానీ, ఈ గాలి దుమారానికి కారణం అంతుపట్టలేదు జయకి.

వెంటనే తన పొరపాటు గుర్తుకొచ్చింది.

ఆ క్రితం రాత్రి ప్రకాశం తనమీద విసిరేసిన వుత్తరాన్ని ఆ అయోమయంలో ఎక్కడోపెట్టి మరిచిపోయింది. అదిప్పుడు వీళ్ళకంటపడి తనను అపార్థం చేసుకున్నారులా వుంది! అయినా నిజా నిజాలేమిటో తెలియకుండా - కనీసం తెలుసుకోవడానికి ప్రయత్నించకుండా - అంత పెద్దావిడ సభ్యత మరిచి మాట్లాడ్డం చీకాకు కల్గించింది జయకి.

నిర్లక్ష్యంగా ఆవిడ వంక చూస్తూ: "మీకు సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరం నాకు లేదు. ఆ అడిగే సంజాయిషీ ఏదో మీ పుత్రరత్నాన్నే అడక్కపోయారా? ఇది చంద్రకీ, నాకూ సంబంధించిన వ్యవహారం! మూడో వ్యక్తి ప్రమేయం అనవసరం! దయచేసి వెళ్ళి - మీ పనులేవో చూసుకోండి" అంది జయ కఠినంగానే.

"అవ్వ! అవ్వ! పెద్దదాన్ననే గౌరవమైనా లేకుండా ఎంతెంత మాటలంటున్నావే? బరితెగించిన ఆడదానినోట ఇలాంటి మాటలు రాక ఇంకెలాంటి మాటలు

వస్తాయి?" మెటికలు విరుస్తూ పెద్ద పెద్ద అంగలతో బయటికి వెళ్ళి పోయిందావిడ,

వెక్కి వెక్కి ఏడుస్తోన్న చంద్ర దగ్గరికి వెళ్ళి సూట్‌కేస్ స్టూల్‌పై పెట్టి ఎలా ఓదార్చాలో తెలీక క్షణకాలం తటపటాయించి చివరకు: "చంద్రా! ప్లీజ్ డోంట్ క్రై! ఇలాంటి సంఘటన జరుగుతుందని ముందుగా ఏ మాత్రం అనుమానం వచ్చినా - నా జాగ్రత్తలో నేనుండేదాన్ని! ఏదేమైనా నా మూలంగా మీ సంసారంలో కలతలు రేగినందుకు చింతిస్తున్నాను" ఎడం చేత్తో ఆమె తల నిమురుతూ చెప్పింది జయ.

జయ వంక చూస్తూ, ద్వారం చూపిస్తూ: 'గెటౌట్! ఐసే గెటౌట్!" అంది చంద్ర తీక్షణంగా.

ఆ షాక్కి - మరో అయిదు నిముషాల తర్వాత గానీ తేరుకోలేకపోయిన జయ- ఏమనుకుందో ఏమో, చంద్ర కళ్ళకేసి ఓ సారి అదోలా చూసి - చరచరా బయటికి వచ్చేసింది!

హాస్టల్‌కి వచ్చేంత వరకూ అతికష్టమ్మీద ఆపుకున్న దుఃఖం రజితని చూడగానే కట్టలు తెంచుకుంది.

"ఏమైందే అలా వున్నావ్?" దగ్గరికి వచ్చి అనునయంగా అడుగుతోన్న రజితని గట్టిగా వాటేసుకుని బావురుమంది.

ఎంత సముదాయించినా జయకి దుఃఖం ఆగలేదు.

ఏనాడూ ఆమె కంటతడిని చూడలేదేమో రజితా వాళ్ళంతా కలవరపడి పోయారు.

ఆ తర్వాత - జరిగిందేమిటో చెప్పమని అరుణ బలవంతపెట్టటంతో జయకి చెప్పక తప్పింది కాదు.

"ఛీ - ఛీ - వాడికి వివేకం లేదనుకుంటే, దీని బుద్ధికేమైంది? హుఁ దానికి పతిదేవుడి మీదున్న నమ్మకం ప్రాణ స్నేహితురాలి మీద లేకపోయిందన్నమాట! ఇలాంటి వాళ్ళను చూసే అంటారేమో ఆడదానికి భర్త తర్వాతే ఎవరైనా అనీ" అంది చేగోడీ.

"ఎవరి తర్వాత ఎవరైతే ఎవరిగ్గావాలి? అసలు వెనకా ముందూ ఆలోచించకుండా జయనలా ఎలా అవమానించిందనేది నా బాధ! స్నేహితురాలిని ఆ మాత్రం అర్థం చేసుకోలేని వ్యక్తికి స్నేహం దేనికీ - స్నేహితులెందుకూ?" అంది రజిత అవేశంగా.

"మన ఆవేశాన్ని తగ్గించుకుని ఆలోచిస్తే, చంద్ర ప్రవర్తనని మనం క్షమించగలం రాజీ! అతడితోటిదే లోకమనీ, అతడు తనను తప్ప - ఎవర్నీ చూడడనే నమ్మకమున్న చంద్రని అలాంటి సంఘటన ఎంతగా క్రుంగదీస్తే అలా ప్రవర్తించిందో - ఏమాత్రం ఆలోచించినా నువ్వలా అనలేవు రాజీ! అది నన్నలా అవమానించినందుకు నాకు బాధ కలగట్లేదు... కానీ, అలాంటి విలాస పురుషుడితో ఎలా సంసారం చేస్తుందో అనేదే నా బెంగ ! అది అతడిని మార్చి

తన జీవితం బావు చేసుకుంటే నాకంతకన్నా కావల్సిందేమీ లేదు! కానీ... మార్చడం... మారడం... సినిమాల్లో, కథల్లోనే గానీ - నిజజీవితాల్లో అలాంటివాళ్ళు నూటికి ఒక్కరు కూడా కన్పించరు!" అంది జయ బాధపడ్తూ.

మళ్ళీ సంక్రాంతి సెలవులిచ్చారు.

ఎవరి ఇళ్ళకి వాళ్ళు వెళ్లిపోయారు. రజితకి - కిందటి సంక్రాంతికి - జయ తమ ఇంటికి వచ్చినప్పటి సంఘటనలు గుర్తొచ్చి - మనస్సేదో తీయని బాధకు గురైంది! హృదయమంతా ఏమిటో బరువుగా, ఎవరైనా మాట్లాడిస్తే కన్నీళ్ళు ఉబికి వచ్చేలా ఉంది. జయకి ఉత్తరం రాస్తే తప్ప తనకి వూరట లభించేట్లు లేదు.

లెటర్ పాడ్, పెన్ తెచ్చుకుని కుర్చీలో కూర్చుంది.

**ప్రియ బాంధవీ జయా,**

ఇప్పుడే రేడియో ఆన్ చేశాను. "తు మేరీ సాథ్ హైతో ముఝె ఫిర్ క్యా కమీహై" అంటూ లత కంఠం కాబోలు శ్రావ్యంగా విన్పిస్తోంది.

ఎవరి స్మృతులు నన్ను పిచ్చెక్కిస్తున్నాయని దూరంగా పారిపోవాలని ప్రయత్నం చేస్తున్నానో తిరిగి ఆ స్మృతులనే గుర్తుకు తెస్తూ గుండె బరువెక్కేలా చేసిందాపాట.

"తు మేరీ సాథ్ హైతో ముజే ఫిర్ క్యాకమీ హై"ట! నామనసులో మెదిలే భావాలను ఒకే ఒక్క వాక్యంలో ఎంత చక్కగా చెప్పాడీ కవి అన్పించింది.

ఈ మధ్య రేడియో పెట్టడానిక్కూడా భయమేస్తోంది. ఎందుకో చెప్పనా? రేడియోలో వచ్చే కొన్ని ఇలాంటి పాటలు నీనా అనుబంధాన్ని గుర్తుకు తెస్తూ - నా హృదయాన్నెంతగా కలిచివేస్తాయో ఆ దేవుడికే తెలియాలి. అఫ్‌కోర్స్, అవన్నీ సినిమాలో ప్రేయసీ ప్రియులు పాడుకున్న పాటలే కావచ్చు. కాని నిజానికి వాళ్ల కన్నా ఎందుకో మనకే అవి సరిగ్గా సరిపోతాయనిపిస్తోంది.

ఇలాంటప్పుడు అన్పిస్తుంది 'ఒకరి కోసం మరొకరు పడే తపన, ఆవేదన, తహ తహలు ఎప్పుడూ ప్రేయసీ ప్రియుల మధ్యో, భార్యాభర్తల మధ్యో తప్ప - వేరే ఏ ఇతర అనుబంధాలపై ఈ కవులెందుకు రాయరబ్బా?" అనీ.

నువ్వు రచయిత్రివిగా, నువ్వయినా ఈ విషయంలో కాస్త కొత్తదారి తొక్కి చూస్తే బావుంటుందేమో ! అయినా స్నేహం మీద రాసే ఏ పుస్తకాలైనా స్నేహంలోని మాధుర్యం తెలిసిన పాఠకులకే తప్ప - మామూలు పాఠకులను రంజింప జేయలేవేమో!

"నీకు గుర్తుందా? మనిద్దరం పెళ్ళి చేసుకుందాం జయా?" అని ఒకసారి అరుణ అన్నందుకు దాన్ని ఆట పట్టించాం గానీ - ఒకర్నొకరికి శాశ్వతంగా బంధీ చేసే శక్తి ప్రపంచంలో ఒక్క మాంగల్యానికే వున్నప్పుడు - అదేదో నీకు నేనో, నాకు నువ్వో కట్టేసి ఎంచక్కా ఒక్కింట్లో కాపురం పెడ్తే ఎంత బావుంటుందో అనే ఆలోచనలు వస్తున్నాయంటే - నవ్వుకోకు !

నీ వుత్తరం కోసం చూస్తూ..... **నీ రజిత.**

లెటర్ రాయడం ముగించి తలెత్తిన రజితకి, అద్దం దగ్గర నిలబడి తలదువ్వుకుంటూ, ఆ అద్దంలో తన వంకే చూస్తోన్న వినోద్ కన్పించాడు.

"అరే, ఎప్పుడొచ్చావ్‌రా?" ఆశ్చర్యంగా అడిగింది.

"వచ్చి చాలాసేపయిందిలే ! నువ్వు ఎవరికో ప్రేమలేఖ రాస్తున్నట్టనిపించి- ఎందుకు డిస్టర్బ్ చేయాలా అని పూర్కున్నాను!" అన్నాడు వినోద్.

"ప్రేమలేఖా?" క్షణం నివ్వెరపోయి, మరుక్షణం నవ్వేస్తూ: "అవును, నిజమేరా- ప్రేమలేఖనే రాస్తున్నాను ! ఎవరికో తెలుసా? - నా 'జయకి'! నా ప్రేమకు ఎంత గుర్తింపో నీకేం తెలుసు ? మనం ప్రేమిస్తే ఎదుటివాళ్ళని కదిలించి, కవ్వించీ మన వైపుకి తిప్పుకోగల సమర్థులం ! నువ్వూ వున్నావ్, ఎందుకూ? మొదటి దెబ్బకే మరి లేవలేక పోయావ్" ఉడికిస్తూ, రెచ్చగొడ్తూ అంది రజిత.

వినోద్ ఏమీ మాట్లాడకపోవడంతో అతడివంక పరిశీలనగా చూసింది రజిత.

మనిషి చాలా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయాయి. ముఖంలో ముందటి చలాకీతనం, కళాకాంతులు మచ్చుకైనా కన్పించట్లేదు.

"వెర్రి అన్నయ్యా! తన ఆకర్షణ అనే పద్మవ్యూహంలో చిక్కుకుని మాలాంటి ఆడవాళ్ళే బయటికి రాలేకపోతున్నారే... మగాడివి నువ్వెంతనీ?" అనుకుందిజాలిగా.

జయ పేరెత్తినప్పుడల్లా అన్నయ్య కళ్ళల్లో మెరిసే మెరుపులు చూసి - అప్పుడప్పుడు జయగురించి చెప్తేనైనా కొంతవరకు అతడి మానసికాందోళన తగ్గవచ్చునుకుని ఆ ప్రయత్నం చేసి చూసింది రజిత.

ఇలా ఆ అన్నా చెల్లెళ్ళిద్దరికీ జయ కబుర్లతోనే ఆ ఏడు రోజులూ గడిచిపోయాయి.

(సశేషం)

**ఆంధ్రజ్యోతి వార పత్రిక 25-3-1977**

★ ★ ★ ★ ★ ★